క్లుప్తంగా

136 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న హెచ్‌వీ భాగ్యలక్ష్మి

కె.కోటపాడు: ప్రతీ గ్రామంలో నెలకు రెండు పర్యాయాలు నిర్వహించే ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను వ్యాధిగ్రస్తులు ఉపయోగించుకోవాలని హెచ్‌వీ భాగ్యలక్ష్మి కోరారు. మంగళవారం గవరపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 136 మందికి వైద్య పరీక్షలతో పాటు మందులను అందించారు. బీపీ, సుగర్ పరీక్షలను చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ నిత్యజ్యోతి, ఏఎన్ఎం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

భీమలింగేశ్వర స్వామి ఆలయానికి సీసీ రోడ్డు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ మహేశ్వరి, సర్పంచ్ కళావతి

మాడుగుల: స్థానిక పురాతన భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎంపీటీసీ కుక్కర మహేశ్వరి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ప్రతి సోమవారంతోపాటు, కార్తీక మాసం, మహాశివరాత్రి పర్వదినాలలో భక్తులు ఇక్కడ ఆలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ నిధులతో సీసీరోడ్డు నిర్మిస్తున్న ఆమెకు మాడుగుల, కేజే పురం, ఎం.కె. వల్లాపురం, సురవరం, గ్రామాల భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు ఎడ్ల హేమంత్ కుమార్, కుక్కర శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం



మాట్లాడుతున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: గర్భిణులు రక్తహీనత సమస్య లేకుండా ఉండేందుకు పోషక విలువలు, పప్పు దినుసులతో కూడిన ఆహారం తీసుకోవాలని వైద్యాధికారి శైలజ తెలిపారు. లంకవానిపాలెం పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. గర్భిణుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. హైరిస్క్ గల గర్భిణుల వివరాలను వైద్య సిబ్బందికి తెలపాలని, ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుపుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేయించుకోవడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యంగా ఉంటారన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.

బుచ్చింపేటలో లేగదూడల ప్రదర్శన



లేగదూడల ప్రదర్శన

రోలుగుంట: పశు గణాభివృద్ధి సంస్థ, పశు సవర్ధక శాఖ సంయుక్తంగా మంగళవారం బుచ్చింపేటలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ఉలబాల చంద్ర ప్రారంభించారు. గ్రామంతోపాటు గుర్రంపేట, వడ్డిప తదితర గ్రామాల నుంచి యజమానులు తీసుకొచ్చిన 50 లేగదూడలను ఇక్కడ ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న రావికమతం మండలం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పుష్ప, పశు వైద్యులు బాలతేజ, మౌనిక న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ఆరోగ్యంగా ఉన్న లేగదూడలను విజేతగా ఎంపిక చేశారు. పోతల వెంకటస్వామి(ప్రథమ), బుదిరెడ్ల చిన్నోడు(ద్వితీయ), రెడ్డి రాజబాబు(తృతీయ) గా ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. దీనికిముందు పశు వైద్యురాలు సౌజన్య పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి నిరోధక టీకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

మమ్మేలు. మోదకొండమ్మ

- కోరిన కోర్కెలు తీర్చే అమ్మోరుగా ప్రసిద్ధి
- అమ్మ ఆశీస్సులతో పాడేరు ఘాట్‌రోడ్‌లో సురక్ష ప్రయాణం
- దాతల విరాళాలతో ఎం.కోడూరులో ఆలయాభివృద్ధి

ఆలయాలు సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలు.. వాటి పరిరక్షణతోనే నేటికీ అనేక గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నాయి. నిత్యం ప్రశాంత వాతావరణాన్ని ప్రసాదిస్తున్నాయి. ఇదే తరహాలో ఎం.కోడూరులో నిత్యం భక్తి భావం వెల్లివిరుస్తోంది. దాతల విరాళాలతో ఇక్కడ వెలసిన మోదకొండమ్మ ఆలయం దినదిన ప్రవర్థమానం చెందుతోంది. భక్తుల కొంగు బంగారంగా, కోర్కెలు తీర్చిన కల్పవల్లిగా విరాజిల్లుతోంది.



నగలు, పూలతో మోదకొండమ్మకు అలంకరణ

మాడుగుల: పాడేరు, మాడుగుల మోదకొండమ్మ ఆలయాల తర్వాత పేరెన్నిక గల ఆలయంగా మండలంలో ఎం. కోడూరు మోదకొండమ్మ ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి ఘనమైన చరిత్ర ఉంది. పాడేరు సమీపంలో అతి



ఆలయ ప్రాంగణంలో పార్కు



మెయిన్ రోడ్డు వద్ద నిర్మిస్తున్న పాదాలు

దట్టమైన అడవి ప్రాంతంలో బడ్డీ పడుకు వద్ద మోదమ్మ జన్మస్థలం కాగా, అక్కడకు ఈనాటికీ భక్తులు వెళ్లలేని పరిస్థితి ఉంది. 300 ఏళ్ల క్రితం ఏజెన్సీకి ఆనుకుని కొండ దిగువ మైదాన ప్రాంతం ఎం. కోడూరులో అమ్మోరు నివాసం ఏర్పరుచుకోవాలని అప్పటి మాడుగుల సామ్రాజ్యాన్ని పాలించే ఒడియా రాజు భూపాలేశ్వరుడికి కలలో కనిపించి అంతర్ధానమైందట. అతని కులదైవం జగన్నాథస్వామి కావడంతో ఆలయ నిర్మాణం చేయలేనని చెప్పినట్లు ప్రతీతి. ఆ తర్వాత గ్రామానికి చెందిన గెంజి వారి కుటుంబీలకు కలలో కనిపించడంతో వారు గ్రామస్తుల సహకారంతో తొలుత కమ్మలపాలకలో అమ్మవారిని ప్రతిష్టించగా, తర్వాత ఆలయం నిర్మించారు. విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నం నుంచి పాడేరు వెళ్లే వాహనదారులు ఇక్కడ ఆలయం వద్ద ఆగి అమ్మవారిని దర్శించుకుని కొండపైకి వెళ్లడం ఆనవాయితీ. ఇక్కడ అమ్మవారి ఆశీస్సులతోనే క్షేమంగా ప్రయాణం సాగుతుందని భక్తుల నమ్మకం.



ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎం. కోడూరులో మోదకొండమ్మ ఆలయం

ఆలయాభివృద్ధికి పూనుకున్న గొల్లవిల్లి

ఒకనాడు కమ్మలపాకలో ఆలయం ఉండేది. కొంతకాలానికి గ్రామస్తులంతా చిన్న ఆలయాన్ని నిర్మించి ఏటా పండగలు నిర్వహించేవారు. 2006లో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, సర్పంచ్ పడాల చిట్టిబాబు, ఉప సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు కృషితో ఆలయం ముందు మండపం నిర్మించారు. తర్వాత దినదినాభివృద్ధి చెందుతూ 2019 నుంచి మాజీ జెడ్పీటీసీ గొల్లవిల్లి ప్రభావతి భర్త, గ్రామ సర్పంచ్ సంజీవరావు తన సొంత నిధులతో పాటు దాతల సహకారంతో ఆలయానికి రూ.20 లక్షలతో గాలిగోపురం ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి అమ్మవారికి ఆభరణాలు అలంకరించారు. రంగురంగులతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. రూ.14 లక్షలతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు తాగునీరు, ఆహ్లాదకర వాతావరణం కలిగించేలా పార్కు, వంటషెడ్లు, పూజారుల నివాసానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు.

ఆలయాభివృద్ధే జీవితాశయం



నేను చిన్నప్పుడే ఆలయాభివృద్ధి చేయాలని నిశ్చయించుకున్నాను. నేను అనారోగ్యానికి గురైనప్పుడు అమ్మవారి ఆశీస్సులతో స్వస్థత చేకూరింది. కుటుంబ సభ్యులంతా రాజకీయంగా ఎదిగాం. ఇప్పుడు దాతలు, గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తున్నాను. రానున్న కాలంలో భక్తులకు నెలకొకసారి అన్నసమారాధన ఏర్పాటు చేయడానికి యోచిస్తున్నాం. ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెంచాలనే ఉద్దేశంతో కృషి చేస్తున్నాను.

– గొల్లవిల్లి సంజీవరావు, సర్పంచ్ ఎం. కోడూరు

గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం



మోదమ్మ ఆలయం వల్ల మా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోంది. నిత్యం సాయంత్రం పలువురు వృద్ధులు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో ఆనందంగా గడుపుతుంటారు. మహిమ గల అమ్మవారని ఈ ప్రాంత భక్తుల నమ్మకం. దాతల సహాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న సర్పంచ్ గొల్లవిల్లికి అభినందనీయం.

– పడాల అప్పలనాయుడు, కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు, ఎం. కోడూరు

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించబోమని పీఎం ప్రకటించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ



కె.కోటపాడులో మాట్లాడుతున్న వెంకటరమణ

కె.కోటపాడు: విశాఖ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్టీల్ ప్లాంట్ నిర్వహణకు సొంత గనులను కేటాయించనున్నట్లు ప్రకటన చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. మంగళవారం కె.కోటపాడులో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌ను పూర్తి స్థాయి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని రకాల వనరులను కల్పించాలని కోరారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవ తీసుకొని ప్రధానితో ప్రకటనను చేయించాలన్నారు. పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాన్ని అర్హులైన పేదలకు కేటాయించి, ఇంటి నిర్మాణానికి సహాయం చేయాలన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు, గొర్లె దేముడు బాబు, రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

కె.కోటపాడులో సీపీఎం జిల్లా నాయకుడు గండి నాయినిబాబు, మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, తదితర నాయకులు నిరసన చేపట్టారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పరిశ్రమ పార్కు శంకుస్థాపన ఆపాలని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ప్లకార్డులతో సీపీఎం నాయకుల నిరసన

నర్సీపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో పార్టీ సీనియర్ నాయకుడు ఎ.బాలకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్లకార్డులతో గాంధీ విగ్రహం వద్ద ప్రధాని రాకను నిరసించారు. రాజు మాట్లాడుతూ బాలకృష్ణ నిరంతరం ప్రజా సమస్యలపై గళం వినిపించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడలేనోళ్లు నక్కపల్లిలో మిటల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. సీపీఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఈశ్వరరావు, కె.రామకృష్ణ, ఐద్వా నాయకులు ఎల్.గౌరి, కె.వి.సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్‌కు అభినందన



రెజ్లింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

చోడవరం రూరల్: జాతీయ మహిళా రెజ్లింగ్ పోటీలో విజేతగా నిలిచిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని గాయత్రిని మంగళవారం ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ఇతర అధ్యాపక బృందం అభినందించింది. గతేడాది డిసెంబర్ నెల 29న విజయవాడలో జాతీయ స్థాయి మహిళల రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎన్. గాయత్రి అనకాపల్లి జిల్లా తరపున పాల్గొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విద్యా సంవత్సరం ఆమె బహుమతులు సాధించడం ఇది రెండోసారి అని ప్రిన్సిపాల్ వెల్లడించారు. చదువుతోపాటు ఎన్‌సిసిలో చురుకుగా పాల్గొంటున్న గాయత్రికి కళాశాల యాజమాన్యం వెన్నుదన్నుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఫిజికల్ డైరెక్టర్ మూర్తి ఆమెకు మరింతగా శిక్షణను ఇచ్చి మెరుగ్గా తీర్చిదిద్దాలని సూచించారు. అభినందించిన వారిలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.మాల్యాద్రి, రత్నభారతి, బి.పిచ్చమ్మ, ఉపన్యాసకులు వి.అప్పల నాయుడు, సుధీర్, మల్లిబాబు, నారాయణమూర్తి, సూర్యవతి, జ్యోతి, లక్ష్మీ మంగమ్మ, కృష్ణారావు, రామలక్ష్మి, జి.వెంకటేష్ ఉన్నారు.

సత్యవరంలో ధనుర్మాస పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల: సత్యవరం గ్రామంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల గంట నుంచి భోగి రోజు వరకు మేలుకొలుపులతోపాటు నిత్య పూజలు కొనసాగుతాయని భక్తులు పాల్గుణ, రాజేశ్వరి, మాలతి, సత్యవతి చెబుతున్నారు. పదేళ్ల నుంచి గ్రామస్తులు సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.



వీధిలో భక్తి గీతాలు ఆలపిస్తున్న భక్తులు

మేలుకొలుపులు

రోలుగుంట: బీబీపట్నంలో భక్త బృందాలు ఐక్యంగా మేలుకొలుపులు కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా గోదాదేవిని గ్రామ వీధుల్లో ఊరేగించి భక్తిగీతాలు ఆలపించారు. భోగి రోజు వరకూ మేలుకొలుపుల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

దివ్యాంగ పింఛన్లపై విచారణ



తూటిపాలలో విచారణ చేస్తున్న ప్రత్యేక బృందం

మాకవరపాలెం: దివ్యాంగ పింఛన్లు పొందే లబ్ధిదారులను ప్రత్యేక బృందం విచారణ చేసింది. దివ్యాంగ పింఛన్లు పొందే వారిలో అనర్హులు ఉన్నారని, వీటిపై కూటమి ప్రభుత్వం విచారణ చేసేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం బూరుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలోని తూటిపాల, బూరుగుపాలెం, మాకవరపాలెం పీహెచ్‌సీ పరిధిలోని జి.కోడూరులో లబ్ధిదారుల వద్దకు ప్రత్యేక బృందాలు నేరుగా వెళ్లి వచారణ చేపట్టాయి. సదరం ధ్రువపత్రాలతోపాటు లబ్ధిదారులను ప్రత్యక్షంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నాయి. మండలంలో మొత్తం 34 మంది దివ్యాంగులు ప్రతి నెలా రూ.15 వేల పింఛను తీసుకుంటున్నారని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. మొదటి విడతగా విచారణ చేస్తున్నారన్నారు. బుధవారం విచారణ కొనసాగుతుందన్నారు.



వైఎస్సార్ కాలనీలో దివ్యాంగురాలిని పరీక్షిస్తున్న కేజీహెచ్ వైద్యాధికారి సత్యరాజ్

కేజీహెచ్ వైద్యాధికారి సత్యరాజ్ ఆధ్వర్యంలో తనిఖీలు

నాతవరం: దివ్యాంగ పింఛనుదారులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామని విశాఖపట్నం కేజీహెచ్ వైద్యాధికారి పి.సత్యరాజ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంటు పోలుపర్తి పార్థసారథి, వెలుగు ఏపీఎం కనకరాజు, కోటవురట్ల, నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు నవీన్‌కిశోర్, ప్రసన్న స్థానిక వైఎస్సార్ కాలనీలో దివ్యాంగ పింఛనుదారులను తనిఖీలు చేశారు. వైద్యాధికారి సత్యరాజ్ మాట్లాడుతూ ఉదయం రోలుగుంట మండలంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామన్నారు. మధ్యాహ్నం నాతవరంలో క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నామన్నారు. తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

భూ సమస్యలు పరిష్కరించలేని సదస్సులెందుకు?

- గిరిజనులకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం
- మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, పీసా కమిటీ కార్యదర్శి వినయ్



భూ సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ రాజును నిలదీస్తున్న కోఆప్షన్ సభ్యుడు రజాక్

నాతవరం: గిరిజనులకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తామని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్ రెవెన్యూ సదస్సులో అధికారులను దుయ్యబట్టారు. మండలంలో చమ్మచింత పంచాయతీ శివారు కురువార గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఎ. వేణుగోపాల్ లేకుండా డిప్యూటీ తహసీల్దార్ టి.వి.ఎల్.రాజు ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేయడంపై రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులు ఆగ్రహించారు. కనీసం సమస్యలు పరిష్కారం చేయలేని సదస్సులు నిర్వహించడం ఎందుకని షేక్ రజాక్, పీసా కమిటీ సభ్యుడు ఎస్. వినయ్, గ్రామ పెద్దలు నర్సింగరావు, రాము, బంగారు శ్రీరాములు, చిననూకరాజు, డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు ఎస్. కొండమ్మ అధికారులను నిలదీశారు. స్వాతంత్ర్యం రాక ముందు నుంచి కురువార గ్రామంలో గిరిజనులు గిరినేతరులు సాగు చేసుకుంటున్నామన్నారు. కొంతమందికి పాసుపుస్తకాలు ఉన్నాయని, వారు పేర్లు ఇటీవల అకారణంగా ఆన్‌లైన్లో తొలగించారన్నారు. రెవెన్యూ అధికారుల తీరుతో గిరిజనులకు గిరిజనేతరుల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. 1/70 యాక్టు పరిధి గ్రామాల్లో గిరిజనులకు అన్యాయం చేయాలని ప్రయత్నిస్తే రాజకీయాలకు అతీతంగా ఉద్యమిస్తామని రజాక్ హెచ్చరించారు. గత నెల కురువాడ గ్రామసభలో తహసీల్దార్‌కు అనేక మంది రైతులు భూసమస్యలపై దరఖాస్తులు ఇచ్చారన్నారు. వాటిలో ఒక్కటీ పరిష్కరించకుండా ఇప్పుడు సదస్సులు నిర్వహించడం ఎందుకన్నారు. డీటీ మాట్లాడుతూ ఈ ప్రాంతం 1/70 యాక్టు పరిధిలో ఉన్నందున భూసమస్యలపై ఏమి చేయలేమన్నారు. టీడీపీ మండల నాయకుడు అప్పన విజయ్, నీటి సంఘం మాజీ డైరెక్టరు సత్యనారాయణ, వీఆర్వోలు సత్తిబాబు, ధారబాబు సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సును వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్న గిరిజన మహిళా రైతులు, గ్రామపెద్దలు



చినగంగవరంలో అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు

అర్జీలు పరిష్కారానికి కృషి

దేవరాపల్లి: రెవెన్యూ సదస్సులలో వచ్చే ప్రతీ అర్జీకి పరిష్కార మార్గాన్ని చూపిస్తామని స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కె. అప్పారావు అన్నారు. గరిశింగి పంచాయతీ చినగంగవరం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను డీటీతోపాటు మండల సర్వేయర్ జి. గోవిందరాజులు స్వీకరించారు. వెరసి చినగంగవరం సదస్సులో నాలుగు అర్జీలు వచ్చాయి. ఆర్ఐ ఎస్. సతీష్, వీఆర్వో ఈశ్వరరావు, గ్రెడ్డి కొండలరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మండలంలో రెండు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అవురువాడ పంచాయతీ శివారు చినసారాడ, పెదసారాడ గ్రామాల్లో సదస్సులకు తహసీల్దారు కె. రమాదేవి హాజరై రైతుల నుంచి ఆర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు పరిష్కారానికి ఈ సదస్సులు దోహద పడతాయన్నారు. ఎంపీటీసీ చదల కృష్ణందొర, మాజీ సర్పంచ్ కోటి, నాయకులు బనీ, కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

18న గౌరీపరమేశ్వరుల ఉత్సవం

అనకాపల్లి: ఉత్తరాంధ్ర జిల్లాలో పేరుగాంచిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాన్ని ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు వాకాడ బాబు, వేల్పుల గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు తెల్లవారు జాము నుంచి ఆదివారం ఉదయం వరకూ అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవానికి సుమారు లక్ష మంది భక్తులు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. నేలవేషాలు, స్టేజ్ ప్రోగ్రాంలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ విద్యుత్ లైటింగ్ ఉంటాయన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు.

ప్రధాని సభకు 25 బస్సులు

మాడుగుల: విశాఖలో బుధవారం జరగనున్న ప్రధాని మోదీ బహిరంగ సభకు మండలంలోని 29 పంచాయతీల నుంచి 25 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. వద్దాదిలో భోజనం ఏర్పాటు చేసి అక్కడ నుంచి సభకు బస్సుల్లో జనం తరలిస్తామన్నారు.

వెలుగు వీవోఏలు జనసమీకరణ

మాడుగుల రూరల్: విశాఖలో ప్రధాని సభ కోసం జన సమీకరణకు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. వెలుగు వీవోఏలు ఇంటింటికి వెళ్లి డ్వాక్రా సభ్యులను కలిసి హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి కోసం సమష్టిగా పని చేద్దాం

- ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట: ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో నాగేశ్వరరావు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇక్కడ పాల్గొన్న వైద్యురాలు ధనలక్ష్మి, పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడు, డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు, ఎంఈవో జగ్గారావు, వ్యవసాయాధికారి ఎస్. విజయలక్ష్మి తదితర అధికారులు శాఖల వారీగా అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించారు. దీనిలో భాగంగా బుచ్చింపేట ఎంపీటీసీ ఉలబాల వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.సన్యాశినాయుడు, కుసర్లపూడిలో తాగునీటి సమస్యను సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ దృష్టికి ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చిన పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలకు బాత్‌రూములు, రన్నింగు వాటర్, మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు ఆ శాఖల అధికారులు తెలిపారు. పార్టీలు పక్కన పెట్టి అభివృద్ధికి సమష్టిగా పని చేద్దాం అని ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ పలు సెగ్మెంట్ల ఎంపీటీసీలను, సర్పంచ్‌లను కలిసి రావాలన్నారు. కొంత మంది అభివృద్ధి పనులపై ఫిర్యాదులు చేయడాన్ని ఖండించారు.



తాగునీటి సమస్య గురించి అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ కొల్లు సన్యాశినాయుడు